క్లుప్తంగా

స్తంభాలకు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వంగిన విద్యుత్ స్తంభాలు, వేళాడుతున్న వైర్లను ట్రాన్స్‌కో సిబ్బంది సరిచేశారు. జూన్ 27వ తేదీన 'సాక్షి'లో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండల శివారులో ప్రమాదకరంగా వేళాడుతున్న వైర్లు, స్తంభాలను సరిచేశారు. ఏఈ కరుణాకర్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు ఆందోళన చెందవద్దన్నారు.

కాలువలో పొదల తొలగింపు



ఎల్లారెడ్డి:పోచారం కాలువలోని పొదలను నీటిపారుదల శాఖ సిబ్బంది చేత తొలగిస్తున్నట్లు డీఈ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. మండలంలోని దేవునిపల్లి శివారు నుంచి పోచారం కాలువలో పేరుకుపోయిన పొదలను సిబ్బంది చేత తొలగించి నీటి పారుదలకు ఇబ్బందులులేకుండాచేస్తున్నట్లు డీఈ తెలిపారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని మల్కాపూర్ గ్రామంలో వైస్ ఎంపీపీ అక్రమంగా రోడ్డు స్థలాన్ని కబ్జా చేసి నిర్మిస్తున్న ఇంటి నిర్మాణ పనులను తొలగించాలని కోరుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు మల్కాపూర్ గ్రామస్తుడు సాయిబాబా తెలిపారు. గ్రామంలోని 8 ఫీట్ల రోడ్డును కబ్జా చేసి ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నాడని ఇట్టి విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, అక్రమ నిర్మాణాన్ని వెంటనే తొలగించాలని ఆయన అధికారులను కోరినట్లు ఆయన తెలిపారు. ఈ విషయమై వైస్ ఎంపీపీ నర్సింలు మాట్లాడుతూ తన సొంత స్థలంలోనే ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నానన్నారు. ఇంటి స్థలానికి సంబంధించిన భూమి రిజిస్ట్రేషన్ ఉందని, నిర్మాణ పనులకు సంబంధించి జీపీ నుంచి అనుమతి తీసుకుని నిర్మాణం చేస్తున్నానన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన




లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని ఇంటింటికీ వెళ్లి వైద్య సిబ్బంది గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హిమబిందు తెలిపారు. ఇళ్లలో, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని గ్రామస్తులకు వివరిస్తున్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, వీరమణి, రేణుక తదితరులున్నారు.

హన్మాజీపేట్‌లో..



బాన్సువాడ రూరల్ : వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం నుంచి తప్పించుకోవడానికి ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలని హన్మాజీపేట్ పీహెచ్‌సీ హెల్త్ సూపర్ వైజర్ లక్ష్మి అన్నారు. శనివారం ఆమె ఆరోగ్య, ఆశ కార్యకర్తలతో కలిసి కోనాపూర్ గ్రామంలో ఇంటింటికి వెళ్లి జ్వర సర్వే చేపట్టి, ఆరోగ్య సూత్రాలను వివరించారు. కాగా మండలంలోని కోనాపూర్, హన్మాజీపేట్ గ్రామాల్లో మందులు వాడినా వారాల తరబడి జ్వరాలు తగ్గకపోవడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

ఈత మొక్కలను నాటిన ఎక్సైజ్ అధికారులు



ఎల్లారెడ్డిరూరల్ (ఎల్లారెడ్డి) : మండలంలోని వెల్లుట్లలో శనివారం ఈత మొక్కలను నాటినట్లు ఎక్సైజ్ ఎస్సై గంగాధర్ తెలిపారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా వెల్లుట్ల చెరువు కట్టపై 300 ఈత మొక్కలను నాటామన్నారు. నాటిన మొక్కలను సంరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్తులు తదితరులున్నారు.

నడకా.. నరకమే..

- వర్షం పడితే రాకపోకలు బంద్
- అధ్వానంగా మారిన రోడ్లు
- అవస్థలు పడుతున్న గిరిజనులు



కొటాంటల్ గడ్డ తండాలో రోడ్డుపై వర్షం నీరు



అధ్వానంగా ఉన్న గట్టుమైసమ్మ తండా రోడ్డు

లింగంపేట(ఎల్లారెడ్డి) : తండాలను జీపీలుగా మార్చిన ప్రభుత్వాలు వాటి అభివృద్ధిలో మాత్రం చొరవ చూపలేదు. మట్టిరోడ్లనుబ బీటీలుగా మార్చాల్సి ఉన్నా ఆ వైపు పట్టించుకోకపోవడంతో గ్రామీణులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తండాల నుంచి బయటకు వెళ్లాలంటే కాలినడకే శరణ్యం. వాహనాలు రోడ్లపై నడిచే పరిస్థితి లేక గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు.

మండలంలో...

లింగంపేట మండలంలోని కొట్టాల్‌గడ్డ తండా, పొల్కంపేట తండా, సురాయిపల్లి తండా, తుల్జానాయక్ తండా, గట్టుమైసమ్మ తండా, రాంపల్లి తండా, శెట్పల్లి తండా, బోనాల్ తండా, చింతల్ గుట్ట తండా, లక్ష్మన్‌నాయక్ తండాతో పాటు పలు తండాలకు మట్టి రోడ్లు మాత్రమే ఉన్నాయి. దీంతో ప్రతీ ఏటా వర్షాకాలం వచ్చిందంటే గిరిజనులు రోడ్లపై నడవాలంటే నరకయాతన పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా రోడ్లపై బైక్‌లు, ఆటోలు, డీసీఎంలు, టాటా ఏసీలు, బులెరో తదితర వాహనాలు వెళ్లడం నిలిపివేశారు. రోడ్లు బురదమయం కావడంతో రైతులు ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం బస్తాలు, మందు సంచులు తెచ్చుకోవడానికి వాహనదారులు తండాలకు రావడానికి నిరాకరిస్తున్నారు. ఏవైనా శుభకార్యాలకు సరుకులు తెచ్చుకోవాలన్నా ఇబ్బందులు పడక తప్పడంలేదని తండాల వాసులంటున్నారు. తండాలకు అధికారులు రావడానికే ఇష్టపడడంలేదని వాపోతున్నారు. తండాలకు కనీసం బీటీ రోడ్లు వేసినా తమకు సౌకర్యంగా ఉంటుందని పేర్కొంటున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు రోడ్లు సక్రమంగా లేక బడులకు వెళ్లలేకపోతున్నారు. బురదలో నడవడమే కష్టంగా మారిందని వాపోతున్నారు.

వాహనాలు రావడంలేదు



తండా నుంచి ఆర్అండ్‌బీ రోడ్డుకు రావాలంటే మూడు కిలో మీటర్లు నడవాలి. సురాయిపల్లి నుంచి తండాకు వెళ్లే రోడ్డు బురదమయమై అధ్వానంగా మారింది. సైకిలు, బైక్‌లు నడవడం కష్టంగా ఉంది. మండల కేంద్రం లింగంపేట, జిల్లా కేంద్రం కామారెడ్డి నుంచి సరుకులు తెచ్చుకోవాలంటే తండాకు ఎలాంటి వాహనాలు రావడానికి ఇష్టపడడంలేదు.

– మెగావత్ హీరామన్, కొట్టాల్‌గడ్డ తండా

విద్యార్థులు వెళ్లట్లేదు..



ఒంటర్ పల్లి నుంచి గట్టు మైసమ్మ తండా వరకు పంట చేన్ల నుంచి రోడ్డు ఇరుకుగా ఉండి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఉంటుంది. తండాలో ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు పైతరగతులకు వెళ్లాలంటే మండల కేంద్రానికి వెళ్లాలి. వర్షాకాలం వస్తే రోడ్డు అధ్వానంగా తయారవుతుంది. దీంతో వర్షం పడితే విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడం మానుకోవాల్సిందే.

– కేతావత్ రాంసింగ్, గట్టుమైసమ్మ తండా

ప్రమాదకరంగా మూలమలుపు



నస్రుల్లాబాద్ అటవీ ప్రాంతంలోని మూలమలుపు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని బాన్సువాడ–వర్ని ప్రధాన రహదారి పైన వర్ని వైపు వెళ్తుండగా అటవీ ప్రాంతంలో మూలమలుపు ప్రమాదకరంగా మారింది. మలుపు వద్ద సూచిక బోర్డులు, ప్రమాద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలోనే ఓ బియ్యం లారీ అదుపు తప్పి బోల్తా పడింది. వారం క్రితం రోడ్డు ప్రమాదంలో బైక్‌లు రెండు ఢీకొట్టి గాయాలయ్యాయి. ఇలా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా ఆ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు, చిహ్నాలు ఏర్పాటు చేయడంలేదని వాహనాదారులు వాపోతున్నారు.

పల్లెల్లో పీర్ల సందడి



నిజాంసాగర్(జుక్కల్) : నెలవంక రాకతో గ్రామీణ ప్రాంత పల్లెల్లో పీర్ల సవారీ సందడి నెలకొంది. ఆయా గ్రామాల్లోని మసీదుల్లో పీర్లను ప్రతిష్ఠించి అలావ్‌ను సిద్ధం చేశారు. రెండు రోజుల నుంచి అబ్బాసాలీ, మొగులాలి, కాశీందుల పీర్లకు ఊరేగింపు చేపట్టి సవారీలు నిర్వహించారు. మొఠ్రం పండుగ నాటికి పీర్లకు సవారీలు చేస్తుండటం ఆనవాయతీగా కొనసాగుతుంది.

అవయవదానం చేసిన కుటుంబాన్ని ఆదుకోవాలి



భిక్కనూరు :మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన మెట్టు ప్రవీణ్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ అవడంతో కుటుంబీకుల అనుమతితో శుక్రవారం అవయవదానం చేసిన సంఘటన విదితమే. మృతుడు ప్రవీణ్‌కుమార్‌కు భార్య రేఖ, తల్లి, కుమారుడు కుమార్తె ఉన్నారు. వారి కుటుంబం పేదరికంతో కొట్టుమిట్లాడుతోంది. ప్రవీణ్‌కుమార్ రామాయంపేట బేకరిలో దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. వారికి ఇల్లు మినహా మిగితా ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. ప్రవీణ్ వేతనంతోనే ఆయన తన కుటుంబాన్ని పోషించేవాడు. ప్రవీణ్ మృతి చెందడంతో వారి కుటుంబం అనాథగా మారింది.ఆయన మృతితో కుటుంబం వీధినపడింది. వారి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. దాతలు స్పందించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రవీన్ కుటుంబీకుల ఫోన్‌పే నంబర్లు 81860 09628,76010 31074లకు స్పందించాలని వారు కోరారు.

చెత్త తొలగించరూ..!



కామారెడ్డి అర్బన్ : పట్టణం విద్యానగర్ కాలనీలోని డ్రీమ్‌హోం అపార్టుమెంట్ వద్ద నుంచి మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది చెత్త తీయకపోవడంతో ఈగలు, దోమలు దుర్వాసనతో మురికి కూపంగా తయారైందని అపార్టుమెంట్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో తమ అపార్ట్‌మెంట్ ఎదురుగా అందరూ వచ్చి చెత్త వేస్తుండగా ప్రతిరోజు శుభ్రం చేయడం లేదని ఆరోపిస్తున్నారు.

కాంప్లెక్స్ ఎరువులను దుక్కిలో వాడాలి



పంటను పరిశీలిస్తున్న అధికారులు

నిజాంసాగర్(జుక్కల్) : వరి నాట్లకు సిద్ధమైన రైతులు కాంప్లెక్స్ ఎరువులను దుక్కిలోనే వా డుకోవాలని బిచ్కుంద వ్యవసాయశాఖ ఏడీఏ లక్ష్మీప్రసన్న సూచించారు. శనివారం బిచ్కుంద మండలంలోని పుల్కల్ శివారులో రైతులు సాగు చేసిన వరి పంట పొలాలను ఆమె పరిశీలించారు. వరి నాట్లు వేసే సమ యంలో మొగిపురుగు నివారణకు పురుగు మందును ముందుగానే పిచికారీ చేయాలన్నారు. ఆమె వెంట వ్యవసాయశాఖ విస్తరణ అధికారి దయానంద్, రైతులు ఉన్నారు.

చెట్ల కొమ్మలే గేటుగా..



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : చెట్ల కొమ్మలనే గేటుగా వాడి అడ్డం పెట్టుకున్నారు.. నస్రుల్లాబాద్ గిరిజన గురుకుల బాలుర పాఠశాల సిబ్బంది. ఏళ్లు గడుస్తున్నా కూడా గేటు ఏర్పాటు చేయక పోవడంతో అడ్డుగా కొమ్మలను పెట్టారు. నిధులను కేటాయించి ప్రహరి నిర్మించినా కూడా పూర్తిస్థాయిలో పూర్తి కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గేటు లేక పోవడంతో లోపలికి పందులు, కుక్కలు, గేదెలు వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.

సంక్షిప్తం

బీసీ కులాలను ఓబీసీలో చేర్చాలి

బాన్సువాడ : రాష్ట్రంలో ఉన్న 28 బీసీ కులాలను వోబీసీలో చేర్చాలని వారాల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల రాజులు అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని బర్కత్‌పురాలోని బీజేపీ సెంట్రల్ కార్యాలయంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ ఎంపీ కోన లక్ష్మణ్ సూచనతో 28 బీసీ కుల సంఘాల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28 వెనుకబడిన కుల సంఘాలకు ఓబీసీలో గుర్తింపు లేకపోవడంతో విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో పిల్లల పురోభివృద్ధి సాధించలేక అనేక అవకాశాలు దగ్గరగా వచ్చి చేజారి పోవడంతో నిరాశకు గురవుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో బోబీసీ ఇన్ క్లూజింగ్ కమిటీ అధ్యక్షులు మోహన్‌చౌహన్, 28 బీసీ సంఘాల ప్రతినిధులు శ్రీరాములు, చంద్రశేఖర్, బండి భాస్కర్, బువ్వరప్ప తదితరులు ఉన్నారు.

హామీలను అమలు చేయాలి

కామారెడ్డి టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రైతులకు రుణమాఫీ రూ. 2లక్షలను మాఫీ చేయాలని, కౌలు రైతులను ఆదుకోవాలని, పంటల బీమా పథకాన్ని అమలు చేయాలన్నారు. ఖాళీలుగా ఉన్న ఉద్యోగాలన్ని భర్తీ చేయాలని, మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ప్రతీ ఒక్కరికి రూ. 2500 చెల్లించాలని, పేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మోతిరాంనాయక్, సురేష్, ఎల్లన్న, నర్సింలు పాల్గొన్నారు.

హెచ్ఎంకు సన్మానం

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో హెచ్ఎంగా విధులు నిర్వహించిన నళిని బదిలీపై సిద్దపల్లి గురుకుల పాఠశాలకు వెళ్తుండడంతో శనివారం విద్యార్థులు ఉపాధ్యయులు కలిసి ప్రిన్సిపాల్ నళిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలను పాటించాలి

కామారెడ్డి టౌన్ : పట్టణంలో ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని జేపీఎన్ రోడ్‌లో ఆటో డ్రైవర్‌లకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. మద్యం తాగి డ్రైవింగ్ చేయవద్దని, ట్రాఫిక్ సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. ప్రతీ డ్రైవర్ లైసెన్స్‌ను కలిగి ఉండాలని రోడ్ల మధ్యలో పార్కింగ్ చేసి ట్రాఫిక్ అంతరాయం కలిగించవద్దని పట్టణ సీఐ చంద్రశేకర్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, ఆటో యూనియన్ అధ్యక్షుడు లడ్డు, రాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళన సభ



బాన్సువాడ : బాన్సువాడ పట్టణ శివారులో ఉన్న ఎస్ఎంబీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించనున్నట్లు మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం సభ స్థలాన్ని ఆయన పరిశీలించారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిక, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాసుల బాల్‌రాజ్‌కు రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ పదవి రావడంతో కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళనానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆర్టిజన్ల శ్రమదోపిడీని అరికట్టాలి

కామారెడ్డి అర్బన్: ఎల్లారెడ్డి డివిజన్‌లోని 32 విద్యుత్ ఉప కేంద్రాల్లో పనిచేస్తున్న ఆర్టిజన్లతో ఎక్కువ గంటలు పనిచేయిస్తూ శ్రమదోపిడీ చేస్తున్నారని తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ (హె చ్–82) జిల్లా అధ్యక్షుడు బి.హరికృష్ణ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఆర్టిజన్ల స్టాండింగ్ ఆర్డర్ ప్రకారం నెలకు 208 గంటలు విధులు నిర్వహించాల్సి ఉండగా, ముఖ్యంగా సర్వాపూర్ సెక్షన్‌లో 360 గంటలు పని చేయించడం అన్యాయమన్నారు. ఆర్టిసన్ల శ్రమదోపిడీపై పోరాటం చేస్తామని అధ్యక్షుడు హరికృష్ణ హెచ్చరించారు.

సౌత్‌జోన్ హాకీ పోటీలకు గర్గుల్ విద్యార్థులు



హాకీ పోటీలకు ఎంపికైన గర్గుల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

కామారెడ్డి అర్బన్ : ఈనెల 19వ తేదీ నుంచి 26వరకు కేరళ రాష్ట్రం కొల్లాంలో నిర్వహించే ఇండియా సబ్ జూనియర్ సౌత్ జోన్ హాకీ చాంపియన్‌షిప్–2024 పోటీలకు కామారెడ్డి జిల్లా గర్గుల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు ఎంపికయ్యారు. పాఠశాలలకు చెందిన జే దినేష్ , పి తులసీకుమార్ (బాలుర విభాగం), కే భవాని, కే.వీణ (బాలికల విభాగం) గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైనట్లు హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కోశాధికారులు నీలం లింగం, ఎస్.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కోశాధికారులతో పాటు కోచ్ ఎ అంజనేయులు, కే అజయ్ అభినందించారు.

ఎండుతున్న చెరువులు



పూర్తిగా ఎండిపోయిన ఇసన్నపల్లి చెరువు



అడుగంటిన ధర్మారం చెరువు

రామారెడ్డి : ఈ వానాకాలం రైతులకు శాపంగా మారింది. రోజులు గడుస్తున్నా వర్షాలు కురవకపోవడంతో మండలంలోని ప్రధాన చెరువులన్నీ ఇప్పటికే ఎండు ముఖం పట్టి ఎడారులను తలపిస్తున్నాయి. ఈ వానాకాలంలో ఇప్పటి వరకు మండలంలో పెద్ద వాన కురవలేదు. సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షాలు నమోదవుతుండడంతో కరువుఛాయలు అలుముకుంటున్నాయి. చెరువు ల్లో నీరు తగ్గిన కొద్దీ ఆయకట్టు రైతుల బోరుబావులు ఎత్తిపోతున్నాయి. మండలంలోని చాలా గ్రామాల్లో అన్ని చెరువులు దాదాపుగా ఎండు ముఖం పట్టాయి.



నీళ్లు లేక బోసిపోతున్న సింగరాయపల్లి చెరువు

పంట వివరాల సేకరణ



పంట వివరాలు సేకరిస్తున్న అధికారి

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలోని బేగంపూర్ శివారులో శనివారం మండల వ్యవసాయ అధికారి నదీం పంట వివరాలు సేకరించి, సోయా, పత్తి, మొక్కజొన్న పంటలకు పట్టిన చీడపీడలకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

కొనసాగుతున్న మైసమ్మ ఆలయ పనులు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని చిన్నదేమిశ వారులో ఉన్న మైసమ్మ ఆలయం నిర్మాణం పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. గ్రామ పెద్దలు మాట్లాడుతూ అక్కడే రైస్‌మిల్‌ను నిర్మిస్తున్న యజమానులు ఆరుపిల్లర్లతో కూడిన గుడి నిర్మాణం చేపడుతున్నారన్నారు. ఈ ఆలయం నిర్మాణం పనులు పూర్తయితే భక్తులకు ఎంతో మేలు జరుగుందన్నారు.

వెంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భక్తి శ్రద్ధలతో ఆలయం ఆవరణలో శావ తీశారు. ఈ కార్యక్రమంలో భక్తులు సిద్దిరాంరెడ్డి, గంగారం, సూర్యం, హన్మాండ్లు, తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

సరస్వతి ఆలయంలో..



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి పట్టణ పరిధిలోని ఇల్చిపూర్ శ్రీసరస్వతి ఆలయంలో శనివారం స్థానిక ఎన్జీవో కాలనీకి చెందిన శైవక్షేత్ర వనిత శక్తి సంఘం మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు, అర్చనలు చేశారు. మహిళలు విశేష పూజలు నిర్వహించిన అనంతరం అందరికి ఆలయ అర్చకులు దత్తురావు, ఆలయ ప్రతినిధి సిద్ధాగౌడ్‌లు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేటితో చండీయాగం ముగింపు



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి పట్టణం టేక్రియాల్ వినాయకనగర్‌లోని శ్రీరామకృష్ణ వైదిక పీఠం వేద పాఠశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న నవ దుర్గ చండీయాగం ఆదివారం ముగుస్తుందని ముగింపు పూర్ణాహుతిలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని వేదపాఠశాల అధ్యక్షుడు శీర్లవంచ కృష్ణమాచార్యులు కోరారు. శనివారం నాటి చండీయాగంలో వేదపండితులు జే.నాగరాజచార్యులు, కొత్తపల్లి రామన్నశర్మ, దొడ్డాజు రాజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వరుణుడి కరుణ కోసం భజనలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : వర్షాలు సమృద్ధిగా కురువాలని వేడుకుంటు మండలంలోని బేగంపూర్ గ్రామస్తులు శనివారం హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు కురువాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించి భజనలు చేశారు. ఆలయాల వద్ద అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.